

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
శనివారం 3 ఫిబ్రవరి 2024





నామినేటెడ్‌పై నజర్

నియామక పదవులపై కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల ఆశలు

- రాష్ట్ర, జిల్లా స్థాయి పోస్టులపై పలువురి దృష్టి
- జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవికి డిమాండ్
- మార్కెట్ చైర్మన్లు, రైతు సమన్వయ సమితుల కోసమూ ప్రయత్నాలు
- నేతల ప్రసన్నానికి ద్వితీయ శ్రేణి కేడర్ ప్రదక్షిణలు
- పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే భర్తీలుంటాయని ప్రచారం

వరంగల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఉత్కంఠ కొనసాగుతోంది. పదేళ్ల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో కీలక పదవులపై నేతలు దృష్టి పెట్టారు. సుదీర్ఘకాలం గా కాంగ్రెస్‌లో పని చేస్తున్న నేతలతోపాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని వారికి నామినేటెడ్ పదవులతో సంతృప్తి పరిచేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవులను ఎవరెవరికి ఇవ్వాలో కాంగ్రెస్ అధిష్ఠానం ఓ జాబితాను సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో కీలకమైన పోస్టులను దక్కించుకునేందుకు సీనియర్లు అధిష్ఠానం పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో ఎవరికి ఏ పదవి దక్కుతుందోనన్న చర్చ జరుగుతోంది.

రాష్ట్రస్థాయి పదవులపై ఆశలు

సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తున్న నేతలకు సముచిత స్థానం కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు వస్తున్న సమాచారంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని నేతలు తమకు రాష్ట్రస్థాయిలో చైర్మన్ పదవులు కావాలని ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాకు చెంది న మాజీ ఎమ్మెల్యే వేంనరేందర్‌రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన సలహాదారుడిగా నియమించడంతో మిగతా నేతలకు కూడా కీలక పదవులపై ఆశలు చిగురిస్తున్నాయి. జనగామ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణలతో పాటు గత ఎన్నికల్లో పరకాల టికెట్ ఆశించిన మాజీ మావోయిస్టు, భూపాలపల్లికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ, ఆత్మకూరుకు చెందిన ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, వర్ధన్నపేట టికెట్ ఆశించిన నమిండ్ల శ్రీనివాస్ తదితరులు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. వీరితోపాటు వరం గల్ ఎంపీ టికెట్ రేసులో ఉన్న మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జంగా రాఘవరెడ్డి కూడా రాష్ట్రస్థాయి పదవుల కోసం పట్టుపడుతున్నారని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 54 నామినేటెడ్ పోస్టులు ఉండగా, ఉమ్మడి వరంగల్ నుంచే అత్యధికంగా పోటీ పడుతుం డటం అధిష్ఠానానికి ఒకింత పరీక్షగా మారిందన్న అభిప్రాయాలున్నాయి. ఈ క్రమంలో ఎవరికి రాష్ట్రస్థాయిలో పదవులు ఇవ్వాలో అనేదానిపై మంత్రులతో చర్చిసున్నట్టు తెలుస్తోంది.

జిల్లా చైర్మన్ పదవులు దక్కేదెవ్వరికో?

నామినేటెడ్ పోస్టుల కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి బొద్దిరెడ్డి ప్రకార్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్, మీసాల ప్రకాష్, బత్తిని శ్రీనివాస్, ఎండీ అజీజ్‌ఖాన్, అబూబక్కర్, రవళిరెడ్డి, పాల్వాయి శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి తదితరులు పోటీలో ఉన్నట్లు సమాచారం. వీరితో పాటు మరికొంత మంది సీనియర్ నేతలు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్‌నాగరాజు, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డిపై నామినేటెడ్ పోస్టుల కోసం ఒత్తిడి తీసుకొస్తున్నారు. అలాగే జనగామ జిల్లా నుంచి సుధాకర్, వి.సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ధన్వంతి భర్త లక్ష్మీనారాయణనాయక్, ముత్తినేని సోమేశ్వర్‌రావు, ఎన్.ప్రవీణ్‌రావు, మహబూబాబాద్ జిల్లా నుంచి బెల్లయ్యనాయక్, భరత్‌చంద్రారెడ్డి, నూనావత్ రాధ తదితరులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐతే ప్రకాష్, సినీ డైరెక్టర్ దామోదర్‌గౌడ్, అప్పం కిషన్, రాంనర్సింహారెడ్డి, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, గొల్లపల్లి రాజేందర్ తదితరులు నామినేటెడ్ పోస్టుల రేసులో ఉన్నారు.

ఈ పదవులపైనే నేతల కన్ను

జిల్లా స్థాయిలో నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్న నేతలు కీలక పదవులపై దృష్టిసారించారు. ముఖ్యంగా వరంగల్ నగరంలోని కూడా పోస్టుపై కీలక నేతలు కన్నేశారు. అత్యంత కీలకమైన పదవి కావటంతో కాంగ్రెస్‌లోని ముఖ్యనేతలు కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. జంగా రాఘవరెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఈవీ శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభార్‌రెడ్డి లాంటి కీలక నేతలు కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఇక వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌పదవిపై కూడా కీలక నేతలు ఆశిస్తున్నారు. అలాగే జిల్లాల్లో అత్యంత కీలకమైన పదవిగా జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ పదవిపై ఎక్కువ మంది ఆశిస్తున్నారు. నెలనెల వేతనంతో పాటు వాహనం అలవెన్స్ కూడా ఇస్తుండటంతో ఎక్కువమంది గ్రంథాలయ చైర్మన్ పదవిపై ఆశతో ఉన్నారు.

అలాగే గత ప్రభుత్వం తీసుకవచ్చిన రైతు సమన్వయ సమితిలపై సందిగ్ధం కొనసాగుతోంది. ఈ పదవులను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ పదవులను కొనసాగిస్తే జిల్లా సమన్వయ సమితి అధ్యక్ష పదవితో పాటు మండల స్థాయిలోనూ కమిటీలతో చాలా మందిని నామినేటెడ్ పోస్టుల్లో భర్తీ చేసే అవకాశం ఉంది. వీటితో పాటు జిల్లా కేంద్రాలతో పాటు ముఖ్యపట్టణాల్లో ఉన్న వ్యవసాయ మార్కెట్లు, దేవాలయాల చైర్మన్ పదవులపై కూడా నేతలు దృష్టి సారించారు. మొత్తానికి పదేళ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీలో నామినేటెడ్ పదవుల జోష్ నెలకొంది.

పదేళ్లుగా ఎదురుచూపులే..

కాంగ్రెస్ శ్రేణులకు నామినేటెడ్ పోస్టులను కట్టబెట్టేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆయా జిల్లాల నుంచి అర్హుల జాబితాను తయారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలోపే ఈ పోస్టులు భర్తీ చేస్తే కేడర్ ఉత్సాహంగా పని చేస్తుందని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, అనసూయ సీతక్కతో ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయమై చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందనే ప్రచారం ఆశావహుల్లో ఉత్కంఠ రేపుతోంది.





సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న హేమలత

కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరు సాగించాలి

- సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత
- రెండో రోజుకు సీఐటీయూ జాతీయ సమావేశాలు
- నేడు బాలవికాసలో ముగింపు కార్యక్రమం



మాట్లాడుతున్న హేమలత

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 2: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, ప్రజలు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హేమలత పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కాజీపేట పాతిమానగర్‌లోని బాలవికాసలో జరుగుతున్న సీఐటీయూ జాతీయ సమావేశాలు శుక్రవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన హేమలత ముందుగా సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ కార్యక్రమాన్ని ప్రారంభించగా హేమలత ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం పెరిగిపోతోందని, దీని ప్రభావం భారత్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. పేద, ధనిక తారతమ్యాలు అధికమవుతున్నాయని గుర్తు చేశారు. ఈ దుష్ప్రభావం వల్ల నిరుద్యోగ దారిద్ర్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు ధరలకు అనుకూలంగా పెరగక పోవడం వల్ల కొనుగోలు శక్తి క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు గణనీయమైన లాభాలు, కార్మికుల వేతనాలు క్షీణించడం ఒక ధోరణిగా ప్రభవించిందని అన్నారు. వ్యవసాయ రంగం, వ్యవసాయ దిగుబడి పదేళ్లుగా సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. ఈ నెల 16న జరిగే గ్రామీణ భారత్‌బంద్‌లో ప్రజలు, కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. రామాలయ నిర్మాణం భావోద్వేగాల మధ్య ప్రారంభించి.. 2024లో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ రాజకీయం చేసే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ ప్రభుత్వం బహుళజాతి ప్రయోజనాల కోసం పని చేస్తోందని, 130కోట్ల ప్రజల జీవితాలను పణంగా పెట్టి డ్రామాలు చేస్తోందని మండిపడ్డారు. కాగా, జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ స్వాగతోపన్యాసంలో వెల్లడించారు. పోరాటాల గడ్డ, చారిత్రక నగరం అయిన ఓరుగల్లు గడ్డపై జాతీయ సమావేశాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సీఐటీయూ బలోపేతం కోసం అన్ని వర్గాలను కలుపుకుని పనిచేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఆఫీస్ బేరర్స్ ప్రభాకర్‌రెడ్డి, మెట్టు రవి, బొట్ల చక్రపాణి, సారంగపాణి, సంపత్, రజిత పాల్గొన్నారు.

మేడారంలో ముమ్మరంగా విద్యుత్ పనులు

7

- జాతరలో నిరంతర కరెంట్ సరఫరాకు ప్రత్యేక చర్యలు
- రూ. 16 కోట్లతో పనులు..
- సీజీఎం, ఇన్‌చార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మోహన్‌రావు వెల్లడి



మృతి చెందిన విశ్వతేజ (ఇన్‌సెట్‌లో ఫైల్)
మృతి చెందిన సూర్యతేజ (ఇన్‌సెట్‌లో ఫైల్)

ప్రాణాలు తీసిన అతివేగం

- డివైడర్‌ను ఢీకొన్న బైక్
- ఇద్దరు విద్యార్థుల మృతి, మరొకరికి గాయాలు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 2: అతివేగం ఇద్దరు బీటెక్ విద్యార్థుల ప్రాణాలు తీసింది. ట్రిబుల్ రైడింగ్ చేయకూడదు.. అతివేగం ప్రమాదకరం.. వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పోలీసులు నిబంధనలు విధించినప్పటికీ పట్టించుకోకుండా ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. గురువారం అర్ధరాత్రి ముగ్గురు బీటెక్ విద్యార్థులు బైక్‌పై అతివేగంగా వెళ్లి డివైడర్‌కు ఢీకొనగా ఇద్దరు విద్యార్థులకు బలమైన గాయాలు తగిలాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సంఘటన కాకతీయ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

బీటెక్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు గురువారం అర్ధరాత్రి ఒకే బైక్‌పై అతివేగంగా ఎర్రగట్టు జంక్షన్ సమీపంలోని కళాశాలకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో కేయూ పీఎస్ సమీపంలోని పెట్రోల్‌పంపు వద్దకు రాగానే అతివేగంగా డివైడర్‌కు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న సిరి అనే విద్యార్థికి స్వల్ప గాయాలు కాగా, బొజ్జ విశ్వతేజ, తిప్పని సూర్యతేజ తలలకు బలమైన గాయాలయ్యాయి. వెనుకాల వస్తున్న విద్యార్థులు.. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ విశ్వతేజ, సూర్యతేజ అనే ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుచున్న ఈ ఇద్దరి మృతితో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. విశ్వతేజ నగరంలోని హనుమాన్‌నగర్ వాస్తవ్యుడు కాగా, సూర్యతేజ కోమటిపల్లి వాస్తవ్యుడు. ఈ సంఘటనను కేయూ ఎస్‌ఐ రాజ్‌కుమార్ ధ్రువీకరించారు. విశ్వతేజ తండ్రి చంద్రమౌళి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 2: ఈవీఎంల మొదటి దశ తనిఖీ ఈ నెల 5వ తేదీన నిర్వహిస్తున్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాట్లను శుక్రవారం అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్‌జీ, ట్రైయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరంగల్ పార్లమెంట్‌కు సంబంధించి హనుమకొండ జిల్లా పరిధిలో పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి చర్చిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్, విద్యుత్ సౌకర్యం, పోలీసు బందోబస్తు, భద్రతా అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డీవో ఎల్.రమేశ్, హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు విజయ్ కుమార్, బావ్‌సింగ్, ఏఓ సత్యనారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నిరుద్యోగులకు జాబ్ మేళా సువర్ణావకాశం

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- సందడిగా ప్రారంభం.. 4,900 మంది అభ్యర్థుల హాజరు

హనుమకొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 2: నిరుద్యోగ యువతను ఉద్యోగరంగాలలో ప్రోత్సహించే విధంగా రాష్ట్రప్రభుత్వం పలు ప్రైవేటు సంస్థల సహకారంతో జాబ్‌మేళాలను ఏర్పాటుచేస్తోందని, దీనిని యువత సువర్ణ అవకాశంగా భావించి సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. తెలంగాణ ఉపాధి దోహద శిక్షణ సంస్థ హైదరాబాద్, కన్సల్టింగ్‌సర్వీసెస్ సహకారంతో యువజన సర్వీసులశాఖ హనుమకొండ జిల్లా ఆధ్వ ర్యంలో శుక్రవారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశారు. ఈ మేళాను హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో కలిసి నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతను ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం పలు ప్రైవేటు సంస్థల సహకారాన్ని తీసుకొని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఆలోచనతోనే సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలు చేపడు తూ వివిధ కంపెనీలతో చర్చలు నిర్వహిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. రానున్న రోజుల్లో యువతకు మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని స్పష్టం చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. సుదూర ప్రాం తాలలో ఉద్యోగ అవకాశాలు లభించిన ప్పటికీ దిగులు చెందకుండా అందివచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్, వరంగల్‌తోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన 65పైగా కంపెనీలు యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి ముందుకు రావడం అభినం దనీయమన్నారు. యువత, విద్యార్థుల అర్హతల ఆధారంగా పలు కంపెనీ లు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయన్నారు.

కాగా, జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులకు అన్ని విధాలుగా సౌకర్యాలను కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలలో ముందుగా ఎంపికైన 10మంది అభ్యర్థులకు అతిథులు ఉద్యోగ నియామ పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, యూత్ సర్వీసెస్ అధికారి జగన్నాథం, డీఎస్‌ఏ కోచ్‌లు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలి

- ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై దృష్టి సారించాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో కేటీఆర్ పిలుపు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 2: పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలని, ఎమ్మెల్సీ ఎంపీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులతో కేటీఆర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టెలీకాన్ఫరెన్స్‌లో పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్‌తో పాటు నియోజకవర్గ పరిధిలోని పార్టీ డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఎంపీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపిస్తే 2లక్షలకు పైగా ఉద్యోగాల భర్తీ చేయడంతో పాటు ఐటీరంగాన్ని అభివృద్ధి చేశామన్నారు. మండలిలో నిరుద్యోగుల పక్షాన కొట్లాడే గొంతుకగా భారత రాష్ట్రసమితి పార్టీ నిలిచిందని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వినయ్ భాస్కర్

ఆడుకుంటూ వెళ్లి.. బావిలో పడి..

- నెక్కొండలో 22 నెలల బాలుడి దుర్మరణం
- మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన కుటుంబంలో విషాదం

నెక్కొండ, ఫిబ్రవరి 2: ఇంటి ఆవరణలో ఒంటరిగా ఆడుకుంటున్న చిన్నారి బావిలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం వరంగల్ జిల్లా నెక్కొండలో చోటుచేసుకుంది. ఎస్సై షెక్ జాన్‌పాషా, స్థానికుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజు బగేల్-రజని దంపతులు బతుకుదెరువు కోసం 6 ఆరు నెలల కిందట నెక్కొండకు వచ్చారు. వీరికి కార్తీక్ (22 నెలలు) ఒక్కగానొక్క కుమారుడు. నెక్కొండలోని రామాలయం వీధిలో అద్దె ఇంట్లో ఉంటున్న రాజు కుటుంబం.. పానీపూరి వ్యాపారం చేసుకుంటున్నారు. రాజు వ్యాపార నిమిత్తం ఇంటి నుంచి వెళ్లగా, రజిని ఇంట్లో పనులు చేసుకుంటోంది. ఈక్రమంలో వారి కుమారుడు కార్తీక్ ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అక్కడే ఉన్న బావికి చుట్టూ గోడ లేకపోవడంతో నేలకు సమాంతరం ఉంది. బాలుడు ఆడుకుంటూ వెళ్లి బావిలో పడ్డాడు. నీటి శబ్దాన్ని విన్న తల్లి బిగ్గరగా ఏడుస్తుండడంతో స్థానికులు వచ్చి బాలుడిని బావి నుంచి బయటకు తీసే ప్రయత్నం చేశారు. బావిలో నీరు ఉండటంతో నీటమునిగిన బాలుడు పది నిమిషాల వ్యవధిలోనే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై నర్సంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు బావిలో నీటిని తోడి అనంతరం మృతదేహాన్ని బయటకు తీశారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ రోదించడం అక్కడివారిని కంటతడి పెట్టించింది.



కార్తీక్ మృతదేహం

ఇంటర్ యూనివర్సిటీ జూడో జట్టు ఎంపిక



క్రీడాకారులతో ప్రొఫెసర్ వెంకయ్య

కేయూక్యాంపస్, ఫిబ్రవరి 2: ఈ నెల 5,6 తేదీల్లో పంజాబ్ అమృతసర్ గురు నానకదేవ్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ 2023-24 ఏడాదికి గాను కాకతీయ యూనివర్సిటీ , స్త్రీ, పురుషుల జూడో జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శుక్రవారం తెలిపారు. జట్టుకు హనుమకొండ జాగృతి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎ.రాజేశ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. ఎంపికైన జట్టును కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అభినందించారు.

చిందు కళకు గుర్తింపు తెచ్చిన ఘనత సమ్మయ్యదే..

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

దేవరుప్పుల, ఫిబ్రవరి 2: చిందు కళను దేశం గుర్తించే స్థాయికి తీసుకువచ్చిన ఘనత గడ్డం సమ్మయ్యదేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన కళారత్న, హంస అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను శుక్రవారం ఆయన స్వగ్రామమైన దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లెలో మంద కృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళను ప్రదర్శించింది చిందు సమాజం అయితే తరతరాలుగా ఆ కళను పోషించింది, గౌరవించింది, కాపాడుకున్నది మాదిగ జాతేనన్నారు. చిందు యక్షగాన కళారూపాలలో సమ్మయ్య కృషి, ప్రతిభను ఆయన ప్రశంసిస్తూ 50ఏళ్ల తపస్సుతో కూడిన తన శ్రమతో, తన కళలతో, నటనతో రంగస్థలపాత్రలతో ప్రజలను అలరించారని కొనియాడారు. సమ్మయ్యకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2కోట్లు ఇవ్వాలని, కళలను బతికించుకునేందుకు ప్రత్యేక భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో చిందు హక్కుల పోరాటసమితి జాతీయ అధ్యక్షుడు గజవెల్లి గణపతి, రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, మాదిగ లాయర్ల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వీవీ రత్నం, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, జనగామ జిల్లా అధ్యక్షుడు గజవెల్లి వెంకన్న, చిందు విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి ప్రతాప్, శరత్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ, సైదులు, శ్రీనివాస్, యాదగిరి, రాములు, ఏసుపాదం, సమ్మయ్య కుమారులు గడ్డం సోమరాజు, హిమగిరి పాల్గొన్నారు.



అప్పిరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ, చిత్రంలో యక్షగాన కళాకారుడు సమ్మయ్య, తదితరులు



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

వనదేవతలకు నిలువెత్తు మొక్కులు

లక్షకు పైగా తరలివచ్చిన భక్తులు ● సందడిగా మేడారం పరిసరాలు



జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 2: తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సందడి నెలకొంది. వివిధ రాష్ట్రాలకు చెందిన లక్షకు పైగా భక్తులు శుక్రవారం మేడారం తరలివచ్చి తల్లుల గద్దెలను దర్శించుకున్నారు. సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. వనదేవతల గద్దెలకు చేరుకొని అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) ఇచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని ఈవో రాజేంద్రం తెలిపారు. కాగా, మేడారం సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకోవడానికి తరలివచ్చే భక్తులు నేరుగా తల్లుల గద్దెలను దర్శించుకోలేక పోయామని అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే తల్లుల కొంగు బంగారం(బెల్లం)గా భావించే ప్రసాదం దొరకడం లేదని అంటున్నారు. తల్లుల గద్దెలకు సమర్పించిన బంగారం ప్రసాదంగా అందాలని భక్తులు కోరుకుంటున్నారు. మేడారం వస్తున్న భక్తులకు తల్లును తాకే అవకాశం లేకుండా గద్దెలకు తాళాలు వేసి దేవాదాయ, పోలీసు శాఖ అధికారుల కుటుంబీకులకు మాత్రం ప్రొటోకాల్ దర్శనాలు కల్పిస్తున్నారని పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హనుమకొండ క్రైం/స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 2: వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు చోట్ల నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో సుమారు రూ.1.27లక్షల మద్యాన్ని పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన మారపాక కరుణాకర్ అనే వ్యక్తి చాలా కాలంగా ఇంటినే అడ్డాగా చేసుకుని బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కరుణాకర్ ఇంటిపై దాడులు నిర్వహించి సుమారు రూ.1.20లక్షల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పట్టుకున్న మద్యాన్ని స్టేషన్ ఘన్‌పూర్ పోలీసులకు అప్పగించారు. అదే విధంగా మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో తరాలపల్లిలో బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. గంగాపురం స్వరూప అనే మహిళ బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. సిబ్బంది స్వరూప ఇంటిపై దాడులు నిర్వహించి రూ. 6 వేల విలువ గల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని సంబంధిత పోలీసులకు అప్పగించారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



తాటికొండలో పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

గాంధీభవన్‌లో దరఖాస్తుల సమర్పణ


హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేస్తున్న రామగళ్ల పరమేశ్వర్

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 2: వరంగల్ పార్లమెంట్ టికెట్ ఆశావహులు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తులను సమర్పిస్తున్నారు. గడిచిన రెండు రోజుల్లో కొందరు ఇప్పటికే దరఖాస్తులను అందచేయగా శుక్రవారం మరి కొందరు టికెట్ కోసం అప్లికేషన్‌ను అందచేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్‌తో పాటు ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, విద్యావేత డాక్టరు ఎనెళ్లి మురళీదర్శన్ తదితర ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం గడువు ముగియనుండడంతో వరంగల్ పార్లమెంట్ టికెట్ రేసులో ఉన్న నేతలు దరఖాస్తులు అందచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రానున్న మూడు రోజుల్లో స్క్రీనింగ్ ప్రక్రియ కూడా ముగియనుండడంతో ఆశావహులు యత్నాలను ముమ్మరం చేశారు. గాడ్‌ఫాదర్లను ఆశ్రయిస్తూ ఢిల్లీలో మకాం వేస్తున్నారు. ఈ నెల 15 నుంచి 18 లోగానే అభ్యర్థుల ప్రకటన పూర్తి చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉన్నట్లు తెలిసింది. మేడారం జాతరకు ముందే అభ్యర్థునలు ఖరారు చేయడం ద్వారా పార్టీకి ప్రయోజనం చేకూరనుందనే అంచనాలు కాంగ్రెస్ నేతల్లో నెలకొన్నాయి.

సీపీని కలిసిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు


సీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 2: వ్యక్తిగత పని నిమిత్తం వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు వచ్చిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ శుక్రవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశారు. సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. శాంతిభద్రతల పరిరక్షణపై ఇద్దరు అధికారులు కాసేపు మాట్లాడుకున్నారు.

మేడారంలో ముమ్మరంగా విద్యుత్ పనులు

- జాతరలో నిరంతర కరెంట్ సరఫరాకు ప్రత్యేక చర్యలు
- పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న సీఎండీ
- సీజీఎం, ఇన్‌చార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మోహన్‌రావు వెల్లడి

హనుమకొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరలో టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ పనులను ముమ్మరంగా చేస్తోంది. జాతరకు ఇంకా 20 రోజులు మిగిలుండగానే ఇప్పటికే 99 శాతం పనులు పూర్తయ్యాయని చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్), ఇన్‌చార్జి డైరెక్టర్ కూడా అయిన వి.మోహన్‌రావు వెల్లడించారు. మేడారం జాతరలో నిరంతరం విద్యుత్ సరఫరా ఏర్పాట్లు, విద్యుదాఘాత ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సిబ్బంది నియామకం, గత జాతర కన్నా ఈ సారి అదనంగా చేపడుతున్న పనులు తదితర అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నాలుగు నెలల ముందు నుంచే..

అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడానికి ముందే మేడారం జాతరలో కరెంట్ సరఫరా పనులు మొదలు పెట్టాం. జాతర ప్రాంతంలో పొలాలు ఉండడం, కోతలు పూర్తికాపోవడంవల్ల అక్కడ పనులు చేపట్టడంలో కొంత ఆటంకం ఏర్పడింది. అయినా మొత్తానికి 99 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను వచ్చే పది రోజుల్లో పూర్తి చేస్తాం. జాతర ప్రాంగణంలో ఇప్పటికే విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. గతంలోకన్నా ఈసారి మరిన్ని అదనపు ఏర్పాట్లు చేస్తున్నాం. జాతరలో భక్తులు విడిది చేసే ప్రాంతమంతటా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. ఇప్పుడు అవసరాన్ని బట్టి కొన్నింటిని ఏర్పాటు చేశాం. జాతర సందర్భంగా మిగతా వాటన్నిటినీ ఉపయోగంలోకి తీసుకువస్తాం. దీని వల్ల కరెంట్ నష్టాలు తగ్గుతాయి.


రూ.16కోట్లతో..

జాతరలో రూ.16కోట్ల అంచనా వ్యయంతో కరెంట్ పనులు చేపట్టాం. జాతరలో 160 కేవీఏ, 100 కేవీఏ తదితర ట్రాన్స్‌ఫార్మర్లు సుమారు 200 వరకు ఏర్పాటు చేశాం. జాతరలో రెండు సబ్‌స్టేషన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అంతకుముందు తాడ్వాయి నుంచి చిన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంట్‌ను తీసుకోవలసి వచ్చేంది. 2013లో కొత్తూరులో ఒకటి, ఆ తర్వాత మ్యూజియం దగ్గర మరోసబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశాం. ఇక్కడి నుంచి నాలుగు ఫీడర్లు వెళుతున్నాయి. వీటిలో ఒక ఫీడర్ ప్రత్యేకంగా అమ్మవారి గద్దెల వరకు వెళుతుంది. ఈ రెండు సబ్‌స్టేషన్ల నుంచి రెండు లైన్లు వేసాము. దీనితో కరెంట్ సరఫరాలో అంతరాయం కలగడం అనేది ఉండదు.

భక్తులు విడిది చేసే ప్రాంతమంతా..

గతంలోకన్నా ఇప్పుడు భక్తులరాక గణనీయంగా పెరిగింది. దీనితో జాతర విస్తీర్ణం కూడా పెరిగింది. దానిని దృష్టిలో పెట్టుకొని జాతరలో భక్తులు విడిది చేసే ప్రాంతమంతటా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. భక్తులు విడిది చేయడం కన్నెపల్లి నుంచి మొదలై అమ్మవారు బయలుదేరు చిలకలగుట్ట ఆ చుట్టుపక్కల ప్రాంతాల వరకు ఉంటుంది. ఈ మొత్తం ప్రాంతానికి కరెంట్ సరఫరా ఉండేలా లైన్లు వేశాం. ప్రధానంగా గద్దెల నుంచి అరకిలోమీటర్ వరకు పటిష్టమైన విద్యుత్ సరపరా వ్యవస్థ ఎప్పటికీ అందుబాటులో ఉంటుంది.


జాతర ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం


సీజీఎం మోహన్‌రావు

ఆర్టీసీవారికి..

జాతరలో ఆర్టీసీకి సంబంధించి ఈ సారి కొన్ని అదనపు పనులను కూడా చేపట్టాం. ఆర్టీసీ గట్టమ్మవద్ద రెండు పార్కింగ్ స్థలాలను, అలాగే తాడ్వాయి వద్ద మరో హోల్డింగ్‌ను అదనంగా ఏర్పాటు చేస్తోంది. అక్కడ అవసరమైన విద్యుత్ సరఫరా ఏర్పాటు చేస్తున్నాం. గద్దెల తర్వాత భక్తుల రద్దీ ఎక్కువ ఉండేది జాతరలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ల వద్దనే. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీవారి సూచనల మేరకు విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేశాం. సరఫరాలో అంతరాయం కలుగకుండా ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే సరిచేయడానికి ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒక ఉద్యోగి ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. ఏ చిన్న సమస్య వచ్చిన సమాచారం అందగానే అవసరమైతే మరికొంత సిబ్బంది కూడా అక్కడికి వెళ్లి తక్షణం పరిష్కరించేలా ఏర్పాట్లు చేశాము.

425 మంది సిబ్బంది

నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయడమే కాకుండా మరింత మెరుగ్గా ఇచ్చేందుకు జాతరలో 425 మంది సిబ్బందిని నియమిస్తున్నాం. ఒక డైరెక్టర్ స్థాయి అధికారితో పాటు ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు, ఏడుగురు డీఈలు, 15మంది అదనపు ఏడీలు, ఏఈలు, లైన్లుమన్లు ఓ అండ్‌ఎం స్టాఫ్ వీరిలో ఉన్నారు. వీరంతా జాతర జరిగే నాలుగు రోజులు రాత్రింబవళ్లు విధుల్లో ఉంటారు. వీరితోపాటు ఎక్కడైనా పోల్ విరిగినా, లైన్లలో అంతరాయం కలిగినా తన కూలీలతో ఆ పనులు పూర్తి చేయడానికి సంబంధిత కాంట్రాక్టర్‌ను కూడా అందుబాటులో ఉంచుతున్నాం.

అంతరాయం కలుగకుండా...

జాతరలో చిరువ్యాపారులు తీగలపై వైర్లు వేసి అక్రమంగా కరెంట్ వాడుకోవడం తరుచూ జరుగుతుంటుంది. దీని వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు లోడు పడి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ఈ సారి అధునాతన సాంకేతికను వాడుతున్నాం. దీనికోసం ఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఎక్కడైనా తీగలపై వైర్లు వేసినా ఆ విషయం క్షణాల్లో జాతరలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలుస్తుంది. సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేసి దానిని నివారిస్తాం.

ప్రమాదాల నివారణకు..

జాతరలో ఇసుకవేస్తే రాలనంత జనం ఉంటారు. ఒత్తిడి తీవ్రంగా ఉంటుంది. ఈ క్రమంలో పోల్స్ దెబ్బతినో, మరేదైనా కారణంవల్ల కరెంట్ వైర్లు తెగి భక్తులపై పడకుండా నివారించేందుకు ప్రతీ మూడు మీటర్లకు ఒక ప్లాస్టిక్ ఫేసర్‌ను వైర్లపై ఏర్పాటు చేస్తున్నాం. వైర్లు సుమారు 17 మీటర్ల ఎత్తులో ఉంటాయి. ప్రమాదవశాత్తు ఎక్కడైనా వైర్ తెగినా అది భక్తులకు తగలనంత ఎత్తులోనే వేలాడుతుంటాయి. దీనివల్ల భక్తులు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉండదు.

సిబ్బందికి వసతి

జాతరలో పనిచేసే విద్యుత్ అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒకటి చొప్పున 40వరకు టెంట్లు వేస్తున్నాం. ఒక్కో టెంట్‌లో ఐదుగురికి వసతి ఉంటుంది. వీరు విధి నిర్వహణ అనంతరం ఇందులో విశ్రాంతి తీసుకోవచ్చు. అంతేకాకుండా సిబ్బందికి భోజన వసతి కోసం జాతరలోని రెండు సబ్‌స్టేషన్ల వద్ద ఫుడ్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నాం.

సీఎండీ ప్రత్యక్ష పర్యవేక్షణ

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మేడారం జాతరలో కరెంట్ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తు న్నారు. కరెంట్ సరఫరా ఏర్పాట్లు సకాలంలో పూర్తయ్యేలా మార్గదర్శనం చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు మేడారం సందర్శించి పనుల పరోగతిని సమీక్షించారు. ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సమీక్ష సమావేశాలు నిర్వహించి పనుల ప్రగతిని అడిగి తెలుసుకుంటున్నారు. గత జాతర కన్నా ఈసారి విద్యుత్ సరఫరా ఏర్పాట్లు మరింత మెరుగ్గా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి కొంత మేరకు నిధులు అందాయి. మిగతా వాటిని ఎన్‌పీడీసీఎల్ సంస్థ భరిస్తోంది. జాతరలో దుకాణాలకు కరెంట్ సరఫరా చేయడం వల్ల వచ్చే ఆదాయం ఏమంత ఎక్కువగా ఉండదు. అయినా కూడా భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని వీలైనంత మేరకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నాం.


విద్యుత్ స్తంభానికి వైరు సరిచేస్తున్న సిబ్బంది

ఎన్నికల వేళ.. 'ఉక్కు'వేడి

- మళ్లీ తెరపైకి బయ్యారం పరిశ్రమ అంశం
- చివరి బడ్జెట్‌లోనూ ఊసెత్తని కేంద్రం
- పదేళ్లుగా మీనమేషాలు లెక్కించిన బీఆర్‌ఎస్
- కాంగ్రెస్‌పైనే నిరుద్యోగుల ఆశలు


మహబూబాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అపార ఖనిజ సంపదతో విరాజిల్లుతున్న మానుకోట ప్రాంతం ఎందుకు వెనుకబడింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక యువత దేనికి విలవిల్లాడుతోంది? ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమం వెనుక నీళ్లు, నిధులు, నియామకాలు కీలకం ఎందుకయ్యాయి. మడిమ తిప్పని మలిదశ ఉద్యమ పోరాట ఫలితంగా కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఇవ్వడం.. సాధన ఉద్యమ పార్టీగా బీఆర్‌ఎస్ పదేళ్లు పాలించడం.. ఇవన్నీ వరుసగా జరిగిన పరిణామాలు..! తాజాగా గురువారం ప్రవేశపెట్టిన చివరి పార్లమెంట్ బడ్జెట్‌లోనూ తెలంగాణ ఉక్కు ఊసేలేకుండా పోయింది. దీనికి ముందే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే విభజన చట్టంలోని హామీలు నేరవేర్చుకోగలమని ఇటీవలనే సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో తెలంగాణ ఉక్కు అంశాన్ని కాంగ్రెస్ రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానాస్త్రంగా సంధించబోతుందన్న సంకేతాలు కన్పిస్తున్నాయి. ఉక్కు పరిశ్రమ నినాదం ప్రతీ ఎన్నికల్లో ఓట్లను కొల్లగొట్టే హామీగానే మిగిలిపోతూ వస్తున్న క్రమంలో ఈ పార్లమెంట్ ఎన్నికల పోరులో బయ్యారం ఉక్కు వేడి మరింత రాజుకోబోతోంది. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర అధికారంలో ఉన్న దరిమిలా విభజన చట్టంలోని ఉక్కు పరిశ్రమ హామీ ఇకనైనా అమలురూపం దాల్చేలా కార్యాచరణ చేపట్టే బాధ్యత తీసుకుంటుందని యువత ఆశిస్తోంది.


ఉక్కు వెనక నడిచిన తతంగమిదీ..

రాష్ట్ర పునర్విభజన చట్టంలోని తెలంగాణ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు రెండుసార్లు జరిగిన పార్లమెంట్ ఎన్నికల నెరవేరని వాగ్దానాలుగానే మిగిలిపోయాయి. సుదీర్ఘకాలంగా సర్వేలపై సర్వేలతో పదేళ్ల పాటు నానుస్తూ వచ్చిన కేంద్రంలోని బీజేపీ, కేంద్రం కాదంటే సింగరేణి ద్వారానైనా పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న పూర్వ తెలంగాణ ప్రభుత్వ ప్రకటనలు ఎన్నికల హామీలుగానే మిగిలిపోయాయి. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన ఏకైక ఉక్కుపరిశ్రమ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరుగున పడేశాయి. బయ్యారం ఇనుప ఖనిజం నిక్షేపాల వెలికితీతకు ఆరు దశాబ్దాల కిందటి చరిత్ర ఉంది. 1952లో తొలిసారిగా బయ్యారంలో మినీ ఉక్కుకర్మాగారం ఏర్పాటు చేసి కొంతకాలం పాటు ఇనుప ఖనిజాన్ని వెలికితీశారు. అలా వెలికితీసిన ఖనిజాన్ని ఇతర రాష్ట్రాలతో పాటు జపాన్‌కు ఎగుమతి చేసేవారు. తర్వాత ఏ కారణం చేతనో కానీ ఇనుప ఖనిజం వెలికితీత పనులు నిలిచిపోయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వ హాయంలో 2004 నుంచి 2009వరకు 5ఏళ్ల పాటు ఖనిజాన్ని మళ్లీ వెలికిసి, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బయ్యారం ఉక్కు అంశం కీలకంగా మారడంతో అప్పటి యూపీఏ ప్రభుత్వం రాష్ట్రం విభజన చట్టంలో ఖమ్మం జిల్లాలో స్టీల్ పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని జోడించింది. ఆ దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పలుమార్లు సర్వేలు జరిపారు. పలు సంస్థలు చేపట్టిన సర్వేల్లో కూడా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగానే సానుకూలత రిపోర్టు వచ్చినట్లు ప్రకటనలు ఊరించాయి.

బీఆర్‌ఎస్ ఆలాగో.. ఇలాగో.. చేస్తానని..

స్వరాష్ట్ర ఆవిర్భావం నుంచి ఉక్కుఫ్యాక్టరీపై నానుస్తూ వచ్చినా కేంద్రం కుదరదని సుప్రీంకోర్టులో తేల్చిచెప్పడంతో గత సర్కార్ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఇతర ప్రజాప్రతినిధులు కేంద్రం ఒప్పుకున్నా లేకున్నా ఎట్టి పరిస్థితుల్లో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి తీరుతామంటూ ప్రకటనలు చేశారు. సింగరేణి సంస్థతో పాటు టీఎస్‌ఎండీసీతో ఖనిజ నాణ్యత, పరిమాణంపై సర్వేలు కూడా చేయించారు. ఇక్కడ సరిపడ ఖనిజం లేకపోయినా పక్క రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ బైలడిల్లా నుంచైనా సరే ముడి సరుకును దిగుమతి చేసుకొని బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి తీరుతామని హామీలు గుప్పించారు. ఒకానొక సందర్భంలో హైదరాబాద్ వచ్చిన కేంద్రంమంత్రి బీరేందర్ సింగ్ కూడా తెలంగాణ వాదులకు తీపి కబురంటూ ఖమ్మం జిల్లా స్టీల్ ఫ్యాక్టరీపై ప్రకటనలు చేశారు. అంతా ఉత్తుత్తే అయిపోయింది. సుమారు 300 మిలియన్ మెట్రిక్ టన్నుల అపార ఇనుప ఖనిజ నిక్షేపాలు బయ్యారంలో ఉన్నాయన్న జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలు ఒకవైపు ఉన్నప్పటికీ కేంద్రం నాణ్యమైన ఐరన్‌ఓర్ బయ్యారంలో లేదని చెప్పడంతో ఉక్కు సంకల్పం ఉట్టికెక్కింది.





రాజుకుంటున్న ఉక్కు నినాదం..

స్వరాష్ట్రంలో మూడోసారి పార్లమెంట్ ఎన్నికల వేడిలో 'ఉక్కు పరిశ్రమ' హామీ రాజుకుంటోంది. కేంద్రంలోని బీజేపీ రెండుదఫాలు బయ్యారం ఉక్కుపై ఎటు తేల్చకుండానే పక్కన పెట్టేసింది. రాష్ట్రంలో సైతం ఉద్యమ ఆకాంక్షతో అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ కూడా దాటవేత ధోరణిలో అంకితభావాన్ని విస్మరించింది. నాడు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఇందులో తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాం కూడా భాగస్వామ్యం వహించడం దాదాపు ఖరారైన క్రమంలో నిరుద్యోగ యువతలో ఉక్కు పరిశ్రమపై ఆశలు చిగురిస్తున్నాయి.

తాజాగా ఖైరతాబాద్ ప్రాంతంలో తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో 'విభజన హామీలు, కేంద్ర ప్రభుత్వం వివక్ష' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించడం, అందులో ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీతో పాటు బయ్యారం ఉక్కు పరిశ్రమ అంశాలు చేర్చడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. స్వయంగా ప్రొఫెసర్ కోదండరామ్ ఈ అంశాలపై ప్రసంగాలు చేస్తూ పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ.. విభజన చట్టం హామీల అమలు ఆవశ్యకతను గుర్తు చేయడంతో కాంగ్రెస్ హయంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు దిశగా అడుగులు పడతాయన్న భావన తెలంగాణ సమాజంలో వస్తోంది. ప్రభుత్వం చేపట్టిన వందరోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు కోసం కసరత్తుల్లో నిమగ్నమైన కాంగ్రెస్ ఆపై ఉక్కుపరిశ్రమ తుట్టెను కదిలిస్తుందని ఆశిస్తున్నారు. పార్లమెంట్ చివరి బడ్జెట్ సమావేశాల్లోనూ బీజేపీ ఉక్కుఊసే ఎత్తకపోవడంతో ఇక ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్‌కు ఇది రేపటి ఎన్నికల నినాద ఆయుధంగా మారుతుందనడంలో అతిశయోక్తి లేదు.

రేపు రిటైర్డ్ సీబీఐ డైరెక్టర్ ప్రసంగ కార్యక్రమం

హనుమకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రైమరీస్కూల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు 'భారత రాజ్యాంగం - సాంస్కృతిక వికాసం - పరిపాలన ధోరణులు' అనే అంశంపై రిటైర్డ్ సీబీఐ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర రావు ప్రసంగం ఉంది. శ్రీ శారదాక్రిష్ణ సాహితీ సామాజిక సాంకేతిక ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి ట్రస్ట్ చైర్మన్ కాసర్ల రంగారావు అధ్యక్షత వహిస్తారు. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఎన్ చారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలకుర్తి దినకర్, కవి, రచయిత డాక్టర్ పల్లేరు వీరస్వామి, అరవింద ఆశ్రమం కార్యదర్శి వరిగొండ కాంతారావు ముఖ్య అతిధులుగా, కవి పండితులు గిరిజా మనోహర్ బాబు విశిష్ఠ అతిథిగా పాల్గొంటారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు రేపు

హనుమకొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి2: వరంగల్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్స్ బాల బాలికల విభాగంలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 9నుంచి 11వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన బాల బాలికలు ఈ నెల 4న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టులో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని వీరన్న సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 9849201467 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 2: హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి రమేష్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోని కేయూ జంక్షన్, గొల్లపల్లి, పెద్దమ్మగడ్డ, గోపాలపురం జంక్షన్‌లలో గురువారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 18 మందిని అదుపుతోకి తీసుకుని పరీక్షలు నిరహించగా, మద్యం సేవించినట్లు తెలిసింది. వీరిని శుక్రవారంకోర్టుకు తరలించగా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన ఎమ్డీ నజీర్, రేగొండ మండలం రాయపల్లికి చెందిన లెదెల్ల శ్రావన్‌కుమార్‌లకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మిగతా 16 మందికి జరిమానా విధించారు.

వ్యక్తి మృతికి కారణమైన ముగ్గురికి ఐదేళ్ల జైలు, జరిమానా

- మరో ఇద్దరికి రూ.4వేల జరిమానా
- తీర్పు వెలువరించిన ప్రధాన అసిస్టెంట్ జడ్జి

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 2: వైవాహిక జీవితంలో జరిగిన గొడవల నేపథ్యంలో అత్తింటి వారు వేధించడం వలన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతికి కారకులైన భార్య కృష్ణవేణి, బావమరిది సురేష్, అత్త కనకతారలకు ఒక్కొక్కరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ ప్రధాన అసిస్టెంట్ జడ్జి బ్యంగి శ్రీనివాసులు తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరునెలలు జైలు శిక్ష అనుభవించాల్సిందిగా తీర్పులో పేర్కొన్నారు. అదే విధంగా దాడికి పాల్పడిన మరో ఇద్దరు నిందితులు నాగరాజు, భార్య మేనమామ రాజశేఖర్ ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే నాలుగు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సిందిగా న్యాయ మూర్తి తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

దర్గాకు చెందిన బాసబత్తిని సురేష్‌కు వరంగల్ కాశిబుగ్గ నివాసురాలైన గోరంట్ల కృష్ణవేణితో 2016 ఏప్రిల్ 20న వివాహం జరిగింది. పెళ్లైన తర్వాత వీరిమధ్య గొడవలు మొదలై ఆరునెళ్ల తర్వాత పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రతీసారి పంచాయితీ నిర్వహించి సురేష్‌తో క్షమాపణ చెప్పించేవారు. తరచూ ఇంట్లో నుంచి గొడవపడి వెళ్లిపోయేది. పెళ్లైన తొమ్మిది నెలల తర్వాత నిందితులు బావమరిది గోరంట్ల సురేష్, అత్త కనకతార, చాలాసార్లు సురేష్‌పై కుటుంబసభ్యులతో కలిసి దాడి చేశారు. ఈ క్రమంలో 2019 జనవరి 25న ఉదయం 7గంటలకు దర్గాలో ఒంటరిగా ఉంటున్న సురేష్‌పై బావమరిది సురేష్ మిత్రులు, అతడి కుటుంబసభ్యులు ఒక కారు, ఆటోలో ఇంటికి వెళ్లి విపరీతంగా కొట్టారు. ముక్కు, చెవుల నుంచి రక్తం వచ్చేలా తీవ్రంగా గాయపరిచారు. మళ్లీ ఆటోలో ఎక్కించుకొని కాశిబుగ్గ వరంగల్‌కు కొట్టుకుంటూ తీసుకెళ్లి వదిలేశారు. దీంతో సురేష్ అవమానాన్ని భరించలేక ఎవరికీ చెప్పులేక కుమిలిపోయాడు. అనంతరం అత్తింటివారు 2019 ఫిబ్రవరి 1న సురేష్, అతడి తల్లిపై మహిళా పోలీసుస్టేషన్‌లో వరకట్నం కేసు నమోదు చేయించారు.

ఈవిషయాలపై బాసబత్తిని సురేష్ మానసిక క్షోభకు గురై మనోవేదనతో 2019 ఫిబ్రవరి 5న సూసైడ్‌నోట్ రాసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్‌నోట్‌లో తన చావుకు భార్య, ఆమె తరపు బంధువులు కారణమని పేర్కొన్నారు. కాగా, సురేష్ భార్య గోరంట్ల కృష్ణవేణి, బావమరిది గోరంట్ల సురేష్, అత్త కనకతార, సురేష్ మేనమామ కోట రాజ్‌కుమార్, అతడి స్నేహితుడు వేముల నాగరాజుపై చట్టరిత్యా చర్య తీసుకోవాలని మృతుడి అక్క బాసబత్తిని సంధ్యారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున ఐదుగురి నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ. సుధాకర్ సాక్షులను ప్రవేశపెట్టగా, దర్యాప్తు అధికారులుగా ఎస్సైలు డి. దేవేందర్, సర్దార్ రాజు వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ. భద్రాద్రి కేసు వాదించారు.



ఆంధ్రజ్యోతి HANUMAKONDA CITY

శనివారం 3 ఫిబ్రవరి 2024

హనుమకొండ సిటీ

• హనుమకొండ • కాజీపేట • హసన్‌పర్తి • ఐనవోలు • ధర్మసాగర్ • వేలేరు

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



ఎ.రవీందర్



బి. బ్రహ్మచారి

ఐనవోలు, ఫిబ్రవరి 2: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎ.రవీందర్, ప్రధాన కార్యదర్శిగా బి.బ్రహ్మచారి, ఉపాధ్యక్షులుగా ఆర్. పరమేశ్వర్, కె.పద్మలత, కోశాధికారిగా బి.నర్సింహులచార్యులు, కార్యదర్శులుగా జి. విజయభాస్కర్‌రెడ్డి, ఎస్.వెంకటనారాయణ, జె.సురేఖ, కె.జ్యోతి, ఆడిటర్‌గా బి.రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక జిల్లా కార్యదర్శి సీఎస్ఆర్ మల్లిక్ పర్యవేక్షణలో జరుగగా జిల్లా కార్యదర్శి చుంచుకాల లింగారావు, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఆర్టీఏ అధికారులు

ఐనవోలు, ఫిబ్రవరి 2: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆర్టీఏ అధికారులు పున్నేలు ఏకశిల పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ప్రభుత్వం అందించిన మార్గదర్శకాలను అనుసరించి భద్రతను పాటించాలని సూచించారు. 18 యేళ్లు నిండని వారు వాహనాలు నడపరాదని సూచించారు. విద్యార్థిదశ నుంచే రోడ్డు భద్రత, డ్రైవింగ్ నియమనిబంధనలపై అవగాహన ఉండాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనం నడిపేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఆర్‌టీఏ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌రాథోడ్, కోలా రవీందర్, షాలిని, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మహిళా పీజీ కళాశాలలో సైన్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సౌజన్య

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 2: సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ పీజీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విభాగం నేతృత్వంలో విజ్ఞాన దర్శిని సైన్స్ సంస్థ ఆధ్వర్యంలో సైన్స్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకుడు, ప్రముఖ హేతువాది టి.రమేశ్ బృందం సైన్స్ అవశ్యకతను కళ్లకు కట్టినట్లు ప్రయోగాత్మకంగా వివరించారు. చేతబడి, దిష్టి తగలడం, దెయ్యాన్ని పారదోలడం, మట్టిలో మండలని సృష్టించడం, నోటి నుంచి శివలింగం తీయడం, రాజు పెంకులపై నడవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో ఉన్న మూఢనమ్మకాలు, అపోహలను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.కవిత, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గద్దర్ త్యాగానికి గుర్తుగా అవార్డులు



మాట్లాడుతున్న రైల్వే జేఏసీ నాయకులు

కాజీపేట, ఫిబ్రవరి 2: గద్దర్ త్యాగానికి గుర్తుగా గద్దర్ అవార్డులు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్నట్లు రైల్వే జేఏసీ నాయకులు అన్నారు. కాజీపేటలోని రైల్వే ఓల్డ్ మిక్స్‌డ్ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే జేఏసీ నాయకులు మాట్లాడారు. కాజీపేట రైల్వే డివిజన్ ఆకాంక్ష కోసం 2007లో కడిపికొండ బ్రిడ్జి నుంచి వరంగల్ ఆజాంజాహి మిల్లు వరకు గద్దర్ అన్న చేసిన పాదయాత్ర స్ఫూర్తితో రైల్వే జేఏసీ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, కొండ్ర నర్సింగరావు, సంతోష్ కుమార్, గుర్రపు సుధాకర్‌రావు, శ్రీనుబాబు, పి. రమేష్, ఎం. మహేష్, దేవదాసు, వీరస్వామి పాల్గొన్నారు.

కిట్స్‌లో ప్రారంభమైన సంశోధిని



జ్యోతి ప్రజ్వలన చేసి సింపోజియం సంశోధిని-24 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 2: ఎర్రగట్టుగుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సాంకేతిక సింపోజియం సంశోధిని-24 ప్రారంభమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్ డీఆర్‌డీవో సైంటిస్ట్ జి.విజయ దుర్గ మాట్లాడుతూ.. యువ ఇంజనీర్ల వినూత్న ఆలోచనలకు, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వాలని సూచించారు. గూగుల్ ద్వారా క్లౌడ్ సర్వీస్‌కు సంబంధించిన నైపుణ్యాన్ని, స్టార్టప్ నైపుణ్యాలను, హైలెవెల్ సింథసిస్ స్కిల్స్ పెంపొందించుకోవడానికి అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సాధనాలను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ద్వారా ఎందరో ఇంజనీర్లను, శాస్త్రవేత్తలను దేశానికి అందించడం అభినందనీయమన్నారు. అనంతరం మరో సైంటిస్ట్ గోపికృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు సానుకూలత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యాలను కలిగి ఉండాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), మెషన్ లెర్నింగ్ (ఎంఎల్) అప్లికేషన్లు మానవ జీవితంలోని ప్రతీ అంశంలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. సంశోధిని ముఖ్య ఉద్దేశం ఇన్నోవేషన్ కోసం అన్వేషణ అని అన్నారు. తొమ్మిది ఇంజనీరింగ్ విభాగాల్లో వివిధ సాంకేతికపరమైన వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా జడ్జి కె.దేవిప్రసాద్, కళాశాల పాలకమండలి సభ్యులు ఎం.వెంకట్రాంరెడ్డి, డీన్లు వి.శంకర్, ఎం.కోమల్‌రెడ్డి, ఎం.నర్సింహారావు, ఏవో రమేశ్‌రెడ్డి, పీఆర్వో దాసరోజు ప్రభాకరాచారి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి



గురుకుల పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు దామోదర్

మడికొండ, ఫిబ్రవరి 2 : విద్యార్థులు లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్ అన్నారు. మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోటివేషనల్ కార్యక్రమంలో దామోదర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థి దశలో ప్రతీ విద్యార్థికి స్వేచ్ఛ ఉంటుంది కానీ అది ఇతరులకు ఆటంకంగా ఉండకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యం సాధించడానికి వీలవుతుందన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పద్దెనిమిది సంవత్సరాల లోపు బాల, బాలికలకు బాలల న్యాయ చట్టం ప్రకారం సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్షణ, సంరక్షణ అవరమైన, ఆపదలో ఉన్న బాల బాలకల రక్షణ, సంరక్షణ కోసం 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎమ్డీ ఖుర్షీద్, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ ఎస్. భాస్కర్, ఔట్ రీచ్ వర్కర్ పి. విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి, ఉపాధ్యాయులు యాదగిరి, భాస్కర్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు బన్న ఐలయ్య

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్



మాట్లాడుతున్న అంపశయ్య నవీన్

సుబేదారి, ఫిబ్రవరి 2 : ఎంతోమంది పరిశోధక విద్యార్థులకు దిశానిర్దేశం చేయడమే కాకుండా ప్రతీ ఒక్కరిని ప్రేమతో పలకరించే ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య నేటి యువతకు ఆదర్శప్రాయుడని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. ప్రిన్సిపాల్ ఐలయ్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో జన్మదిన వేడుకలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా అంపశయ్య నవీన్ హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న ఐలయయ్యతోపాటు తెలుగు విభాగాధిపతి డాక్టర్ చిర్ర రాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య హనుమంతు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన భూమిని అప్పగించాలి

మడికొండ, ఫిబ్రవరి 2 : మడికొండలోని వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన భూమిని కబ్జా చేసిన వారిపై తగిన చర్యలు తీసుకొని ఆ భూమిని తిరిగి దేవస్థానానికి అప్పగించాలని కోరుతూ మడికొండ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు దువ్వ విజయ్ శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. కాకతీయుల కాలంలో నిర్మించిన దేవస్థానంలో దూప, దీప నైవేద్యం కోసం అప్పటి పాలకులు సర్వే నెంబర్లు 51, 52, 58, 59, 80లలో 9.4 ఎకరాల భూమిని దేవస్థానానికి అప్పగించారన్నారు. 2009లో అప్పటి అర్చకులు దేవాదాయ, ధర్మాదాయ శాఖకు అప్పగించి రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఆ భూమిని కొంత మంది రాజకీయ పలుకుబడితో రిజిస్ట్రేషన్ చేసుకొని పట్టాదారు పాసుపుస్తకాలు పొందారన్నారు. ఈ భూమి విషయమై తగిన విచారణ జరిపి కబ్జాదారుల నుంచి కాపాడి దేవస్థానానికి అప్పగించాలని వినతి పత్రంలో సీఎంను కోరినట్లు విజయ్ స్పష్టం చేశారు.

నేడు 'కుడా'లో మంత్రి సురేఖ సమీక్ష

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 2: హనుమకొండలోని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శనివారం సమీక్ష జరుగనుంది. మంత్రి కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు సమీక్ష ఆరంభంకానుంది. జీడబ్ల్యూఎంసీ, కుడాతో పాటు లైన్ డిపార్ట్‌మెంట్ల అభివృద్ధిపనులపై మంత్రి సురేఖ సమీక్షించనున్నట్లు తెలిసింది. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా కొండా సురేఖ 'కుడా' కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్నారు.

కొండేటి శ్రీధర్‌కు అభినందనలు

మడికొండ, ఫిబ్రవరి 2 : భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మాజీ శాసన సభ్యుడు కొండేటి శ్రీధర్‌ను పార్టీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి సమక్షంలో శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు చిటూరి అశోక్, మల్లాడి తిరుపతిరెడ్డి, బన్న ప్రభాకర్, గడ్డం మహేందర్, నల్లబెల్లి సుదర్శన్, జన్ను మధు, మాదాసు రాజు, మైదం వీరస్వామి, మైదం అజయ్, రంజిత్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 2: హనుమకొండ జిల్లాలోని అన్ని కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, వికలాంగ, మైనారిటీ ఫ్రెష్, రెన్యూవల్ విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్ www.telanganaepass.cgg.gov.onలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా కేంద్రం చర్యలు



చర్చలో పాల్గొన్న అధ్యాపకులు

సుబేదారి, ఫిబ్రవరి 2: ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య హనుమంతు అన్నారు. కళాశాలలోని అర్థశాస్త్ర విభాగం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్ అధ్యక్షతన శుక్రవారం 2024-25 బడ్జెట్‌పై చర్చించారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ.. నూతన బడ్జెట్‌లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)కి నిధులు సగానికి సగం కట్ చేయడం చూస్తే ప్రభుత్వ రంగాన్ని చిన్నాభిన్నం చేసేలా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందన్నారు. ఈ బడ్జెట్ పూర్తిగా ఉన్నత వర్గాలకు దోహపడుతుందన్నారు. ఈ చర్చలో అధ్యాపకులు రమేష్, హరిశంకర్, సంజీవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన భవనానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 2: హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలోని వాలీబాల్‌కోర్టులో వాలీబాల్ క్రీడాకారులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా ఉండే నూతన భవన నిర్మాణానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేతాజీ వాలీబాల్ అసోసియేషన్ సూచన మేరకు వాలీబాల్ క్రీడాకారుల సౌకర్యార్థం దుస్తులు మార్చుకోవడంతో పాటు వారి విలువైన వస్తువులను భద్రపర్చుకునేందుకు వీలు ఉండేందుకు నూతన భవన నిర్మాణం కోసం వ్యక్తిగతంగా రూ. లక్ష ఇచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ చీకటి ఆనంద్, ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు అజీజ్‌ఖాన్, నేతాజీ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పిండి విజయ్‌కుమార్, కార్యదర్శి బొబ్బిలి వెంకట్‌రెడ్డి, సభ్యులు సుధాకర్, పాపిరెడ్డి, రవిందర్, శేఖర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సతీష్, శ్రీరాము, ప్రసాద్, కృష్ణ, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10వ డివిజన్‌లో..

● హనుమకొండ 10వ డివిజన్ అలంకార్ సమీపంలోని రాయపుర, పద్మాక్షీకాలనీ ప్రాంతాలలో సుమారు రూ.45లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10వ డివిజన్ పరిధిలోని రాయపుర, పద్మాక్షీకాలని ప్రాంతాల్లో రూ.45లక్షలతో నిర్మించ తలపెట్టిన పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్, చీకటి శారద ఆనంద్, మామిండ్ల రాజు, నాయకులు చీకటి ఆనంద్, జుజేర్, మాడిశెట్టి రాజు, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు మొండిచెయ్యి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 2: కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు మొండి చెయ్యి చూపి, ఉన్నతవర్గాలకే సముచిత స్థానం కల్పించారని సుబేదారి యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హన్మంతు అన్నారు. శుక్రవారం కళాశాల అర్థశాస్త్ర విభాగం ఇన్‌చార్జి డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ నేతృత్వంలో కేంద్ర బడ్జెట్-2024పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన హన్మంతు మాట్లాడుతూ.. యూజీసీకి నిధులు కట్ చేసి ఉన్నత విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని అన్నారు. వ్యవసాయ రంగానికి అనుకున్నంత కేటాయింపులు జరుగలేదని చెప్పారు. దేశ రైతాంగం వ్యవసాయ రంగాన్ని వీడే ప్రమాదం ఏర్పడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ తిరుణహరి శేషు, డాక్టర్ కోమటి లక్ష్మినారాయణ, డాక్టర్ ఎర్రబోజ్జ రమేశ్, డాక్టర్ హరిశంకర్, డాక్టర్ సంజీవ్, డాక్టర్ ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

వడ్డేపల్లి, ఫిబ్రవరి 2: హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బత్తిని చంద్రమౌళి గౌడ్ ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాకాల అటవీ సంరక్షణ అధికారి వి.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. చిత్తడి నేలలు జీవ వైవిధ్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పార్వతి, ఈకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ కె.సరిత, మెంబర్లు మాధవి, పల్లవి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుమార్



వడ్డేపల్లి, ఫిబ్రవరి 2: గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ ఎల్లాపూర్‌కు చెందిన దేవనబోయిన కుమార్‌యాదవ్ తెలంగాణ యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం యాదవ్ ఆదేశం మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏశబోయిన సాంబయ్య యాదవ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లాలో యాదవ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని దేవనబోయిన కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

ఐనవోలులో వసూళ్లను నిలిపివేయాలి

ఐనవోలు, ఫిబ్రవరి 2: ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరకు వచ్చే భక్తుల వాహనాలకు ఎంట్రీ ఫీజు పేరిట కొందరు ప్రైవేటు వ్యక్తులు డబ్బులు వసూలు చేయడాన్ని అరికట్టాలని బీఎస్పీ వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు చింత సామ్యూల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఆదివారం, బుధవారం ఐనవోలు వారాంతపు జాతరలకు వివిధ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ప్రైవేటు వాహనాల ద్వారా వస్తున్నారు. వారి వాహనాలను ఆలయ ప్రాంగణంలోకి వెళ్లనీయకుండా బయట నిలిపివేయడంతో కొందరు వ్యక్తులు స్థలం తమదేనని ఎంట్రీ, పార్కింగ్ ఫీజుల పేరిట బలవంతంగా వసూలు చేస్తున్నారని అన్నారు. ఈ వసూళ్లపై దేవాదాయధర్మాదాయ శాఖ అధికారులు చొరవతీసుకొని కట్టడి చేయాలన్నారు. ఈ విషయంపై ఈవో నాగేశ్వర్‌రావు వివరణ అడగగా భక్తుల వాహనాలు లోనికి రావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని పోలీస్ అధికారుల సూచన మేరకు ఆలయం తూర్పు వైపున ప్రైవేటు స్థలాన్ని లీజుకు తీసుకొని ఉచితంగా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశామని అక్కడ వాహనాలకు పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.

10న విద్యార్థులకు ప్రతిభ పాఠవ పోటీలు

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 2: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పాఠవ పోటీలను ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని రీజినల్ సైన్స్ కేంద్రంలో ఉదయం 9.30 గంటల నుంచి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 6వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి సెల్ నెంబర్ 9490112848లో సంప్రదించాలన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో రామన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 2: క్వెస్ట్ సైన్స్ ఒలంపియాడ్‌లో రామన్ విద్యార్థులు వెయ్యిలోపు 200 ర్యాంకులు సాధించగా, అందులో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 100 లోపు ర్యాంకులను 14 మంది విద్యార్థులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజేష్ కుమార్ రామినేని తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను అభినందించారు. అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పురుషోత్తం తీర్థాల, మడికొండ, హనుమకొండ ప్రిన్సిపాల్స్ స్రవంతి, రజిత, వైస్ ప్రిన్సిపాల్ అనుపమ, గణిత అధ్యాపక బృందం పాల్గొంది.

విధుల్లో చేరిన పరిపాలన అధికారులకు అభినందనలు



రామచంద్రంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఈసం నారాయణ, పుల్లా శ్రీనివాస్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 2: కాకతీయ యూనివర్సిటీలో పరిపాలన పదవుల్లో చేరిన వర్సిటీ అధికారులకు శుక్రవారం వివిధ సంఘాల నేతలు, నాయకులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. కేయూ దూరవిద్య కేంద్రం నూతన డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంకు కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్ నేతృత్వంలో పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ టెక్నికల్ అసోసియేషన్ నేతలు వి.నందయ్య, ఎస్డీఎల్‌సీఈ పీఆర్‌ఓ డాక్టర్ ఎప్రామ్‌రాజ్, బొక్క మొగిలి, నమిండ్ల కిరణ్‌కుమార్, రాము పాల్గొన్నారు.

ఎంపీగా బరిలో నిలిచే అవకాశం కల్పించండి: జోరిక

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 2: త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి వరంగల్ ఎంపీగా నిలిచే అవకాశం తనకు కల్పించాలని మాజీ కార్పొరేటర్, ఉద్యమ నేత జోరిక రమేశ్ హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్‌కు వినతి పత్రం ఇచ్చారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పలువురు ఉద్యమకారులతో జోరిక రమేశ్ దాస్యం వినయభాస్కర్‌ను కలిశారు. వరంగల్ ఎంపీ నియోజకవర్గ పరిధిలోని శాసనసభ నియోజకవర్గాల్లో ఉద్యమకారుడిగా విస్తృత పరిచయాలున్నాయన్నారు. తనకు అవకాశం కల్పించాలని కోరారు. అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానని వినయభాస్కర్ తెలిపారు.



ఆంధ్రజ్యోతి HANUMAKONDA RURAL శనివారం 3 ఫిబ్రవరి 2024

హనుమకొండ రూరల్

'గ్రామీణ రైతు బంద్'ను విజయవంతం చేయాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 2 : రైతులు పెట్టిన పెట్టుబడికి మద్దతు ధర కల్పించాలని కోరుతూ ఈనెల 16న హైదరాబాద్‌లో నిర్వహించే గ్రామీణ రైతు బంద్ సభను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కామారం గ్రామంలో తోట రాజేందర్ అధ్యక్షతన రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఊరటి అంశాల్ రెడ్డి, తోట చంద్రశేఖర్, తోట కుమార స్వామి, గాజె రాజేందర్, చింతాకుల మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దామెర, ఫిబ్రవరి 2 : దామెర మండల కేంద్రంలోని దామెర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ గుర్రం రమేష్ తెలిపారు. శుక్రవారం దామెర మండల కేంద్రంలో ఏఈ జి.రమేష్ మాట్లాడారు. దామెర ఎక్స్‌ప్రెస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు. కాగా, మండల పరిధిలోని సంబంధిత గృహ విద్యుత్, పాఠశాల యాజమాన్యం, వాణిజ్య, వ్యాపార, పరిశ్రమలు, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

శాయంపేట, ఫిబ్రవరి 2 : మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించనునట్లు ఇంచార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులతోపాటు అన్ని శాఖల అధికారులు సంబంధిత పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని, దిగువ స్థాయి సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లో పంపకూడదని ఎంపీడీవో కోరారు.

నేటి ఓబీసీ సాధన సభను విజయవంతం చేయాలి

దామెర, ఫిబ్రవరి 2 : ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఓబీసీ సాధన సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు వున్నగిరి శ్రీకాంత్ కోరారు. శుక్రవారం దామెర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడారు. ఆరె సామాజిక వర్గం వారికి ఓబీసీ సర్టిఫికెట్ లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. తద్వారా కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉద్యోగాల్లో అవకాశాలు రాకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హైదరా బాద్‌లోని నాచారం రాఘవేంద్ర నగర్‌లోని ఏఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఆరె కులస్థులు తరలాలని పిలుపు నిచ్చారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఓటు నమోదు



డిగ్రీ కాలేజీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్ కుమార్

పరకాల, ఫిబ్రవరి 2 : నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం పరకాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్స్ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదుకు ఎస్ఎస్‌సీ, డిగ్రీ మెమో, ఆధార్, ఓటరుకార్డు జిరాక్సులు, ఒక పాస్‌ఫొటోతో ఫారం 18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర విభాగాధిపతి ఎం.రవి కుమార్, ఎన్ఎస్ఎస్ విభాగం అధిపతి డాక్టర్ జి.ఓదేలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యావంతులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటరుగా నమోదు చేసుకోవాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ పిలుపు నిచ్చారు. ఓటరు నమోదుకు ఈ నెల 6వ తేదీ చివర తేదీ అని, ఆన్‌లైన్‌లో సైతం ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు మొండిచెయ్యి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 2: కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు మొండి చెయ్యి చూపి, ఉన్నతవర్గాలకే సముచిత స్థానం కల్పించారని సుబేదారి యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హన్మంతు అన్నారు. శుక్రవారం కళాశాల ఆర్థశాస్త్ర విభాగం ఇన్‌చార్జి డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ నేతృత్వంలో కేంద్ర బడ్జెట్-2024పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన హన్మంతు మాట్లాడుతూ.. యూజీసీకి నిధులు కట్ చేసి ఉన్నత విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందని అన్నారు. వ్యవసాయ రంగానికి అనుకున్నంత కేటాయింపులు జరుగలేదని చెప్పారు. దేశ రైతాంగం వ్యవసాయ రంగాన్ని వీడే ప్రమాదం ఏర్పడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ తిరుణహరి శేష, డాక్టర్ కోమటి లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎర్రబోజ్జు రమేశ్, డాక్టర్ హరిశంకర్, డాక్టర్ సంజీవ్, డాక్టర్ ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా బాధ్యతగా పనిచేస్తా..

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల, ఫిబ్రవరి 2 : గత పాలకుల నిర్లక్ష్యంతోనే పరకాల పట్టణం అభివృద్ధిలో వెనుకబడి పోయిందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల పట్టణ కేంద్రంలోని పలు వీధుల్లో, కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పరకాల మునిసిపల్ కమిషనర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో ముచ్చటిస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలు, గత ప్రభుత్వంలో జరిగిన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వారు తెలిపిన సమస్యలను మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు, కొత్త మార్కెట్ బిల్డింగ్, దామెర చెరువు మినీ ట్యాంకును పరిశీలించారు. కుంకుమేశ్వర దేవాలయం సమీపంలోని ఆటోస్టాండ్, బస్టాండ్ వద్ద చిరు వ్యాపారుల సమస్యలు సైతం అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యం తోనే పరకాల పట్టణం అభివృద్ధిలో వెనుకబడిపోయిందన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గెలుపు ఓట ములు సహజమని ప్రజలు ఒక సారి అవకాశం ఇచ్చి నప్పుడు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరకాల పట్టణ అభివృద్ధికి ప్రజలు వివిధ పార్టీల నాయకులు, అధికా రులు సహకరించాలని కోరారు. మొదటి ప్రాధా న్యతగా ప్రధాన సమస్యల పరిష్కారంపై దృ ష్టి పెట్టి అవసరమైతే నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు.

'అడ్డంకులు అధిగమించి గ్రామాభివృద్ధికి కృషి'

శాయంపేట, ఫిబ్రవరి 2 : గ్రామ ప్రజల ఆశీ ర్వాదంతో గ్రామాభివృద్ధికి శక్తికి మించి పని చేశా నని శాయంపేట తాజా మాజీ సర్పంచ్ కం దగ ట్ల రవి అన్నారు. సర్పంచ్ పదవికాలం పూర్త యిన సందర్భంగా శుక్రవారం స్థానిక గ్రా మ పంచాయతీ కార్యాలయంలో రవి విలేక రులతో మాట్లాడారు. గ్రామ ప్రజల సహకారంతో రూ.6 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. భారీగా బిల్లులు పెండింగ్‌లో ఉన్న కారణంగా కొన్ని పనులు మధ్యలో నిలిచి పోయాయని అన్నారు. స్థానికంగా ఎన్నో వెన్ను పోట్లను భరించానని, గ్రామ ప్రజలు అన్ని గమ నించారని పేర్కొన్నారు.

నియోజకవర్గ, జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు సహకరించకపోయిన నిరంతరాయంగా గ్రామాభివృద్ధి కోసం పరిత పించానని సహకరించిన ప్రతీ అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. పదవులతో సంబంధం లేకుండా పని చేస్తానని స్ప ష్టం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు



ముల్కనూర్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎల్పీవో సుదర్శన్

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 2: భీమదేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారులు శుక్రవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లోని సర్పంచ్‌లు మండలంలోని ప్రత్యేక అధికారులు బాధ్యతలు అప్పగించారు. గ్రామాల్లోని సిబ్బంది ప్రత్యేకాధికారులకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. డీఎల్పీవో సుదర్శన్ ముల్కనూర్‌లో చార్జీ తీసుకోగా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో నాగరాజు, సీడీపీవో స్వరూప, ఏఈలు రాజమల్లారెడ్డి, సంతోష్‌కుమార్, రాజేష్, వెటర్నరీ డాక్టర్లు మాలతి, పార్థసారధి, ఏవో అబ్దుల్‌పాషా, ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులు చార్జీ తీసుకున్నారు.

● దామెర : మండలంలోని ఆయా గ్రామాల్లో పలువురు అధికారులు ఇన్‌చార్జులుగా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో దామెర మండలం పులుకుర్తి గ్రామంలో తహసీల్దార్ ఎం.జ్యోతివరలక్ష్మీదేవి, ఊరుగొండ గ్రామంలో ఎంపీడీవో ఎం.వెంకటేశ్వర్‌రావు, దామెర గ్రామంలో ఎంపీవో కె.వి.రంగాచారి, కోగిల్వాయి గ్రామంలో వ్యవసాయాధికారి శ్రీనివాస్, ముస్త్యా లపల్లిలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ దీపిక, ఒగ్లాపూర్ గ్రామంలో నాయబ్ తహసీ ల్దార్ ఎమ్డీ.యూసుఫ్ ఖురేషీ తదితరులు బాధ్య తలు చేపట్టారు. కాగా, ఆయా గ్రామాల్లో తాజా మాజీ సర్పంచ్‌లు, జీపీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రంపహాడ్ జాతరకు సకల ఏర్పాట్లు

పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ కిషోర్‌కుమార్

ఆత్మకూరు, ఫిబ్రవరి 2 : సమ్మక్క జన్మస్థానమైన అగ్రంపహాడ్‌ను దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని, భక్తుల కోసం సకల ఏర్పాట్లు చేస్తున్నామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతర వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కమలాపురం రమేష్, మాజీ ఎంపీపీ గోపు మల్లికార్జున్, ఎండోమెంట్ ఈవో శేషగిరి, పూజారులు, కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వనదేవతల ఇక్కడ కొలువుతీరడం మన అదృష్టమని అన్నారు. సమ్మక్క జన్మస్థానమైన అగ్రంపహాడ్‌లో మొదటి మొక్కులు చెల్లించి మేడారం వెళ్లడం ఆనవాయితీ అని తెలిపారు. వచ్చే జాతర సమయానికి ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. జాతర విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు జాతరలో ఉండి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

భారీ పోలీస్ బందోబస్తు..

అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అగ్రంపహాడ్‌ను ఆర్డీవో శ్రీనివాస్, సీఐ రవిరాజు, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డితో కలిసి ఏసీపీ జాతర పనులను పరిశీలించారు. ఈ క్రమంలో జాతరకు వచ్చే రోడ్లు, భక్తులు విడిది చేసే స్థలాలను పరిశీలించారు. ఇప్పటికే భక్తులు వస్తున్నందున త్వరితగతిన ఏర్పాట్లను చేయాలని ఎండోమెంట్ అధికారులకు ఆదేశించారు.

గురుకులాల్లో ప్రవేశాల కోసం ప్రచారం



మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాల ప్రచారంలో ప్రిన్సిపాల్ శ్రీలత

దామెర, ఫిబ్రవరి 2 : దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని మైనారిటీ గురుకుల పాఠశాల ప్రవేశాల కోసం శుక్రవారం పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. గురుకుల పాఠశాల నుంచి సైలానీ బాబా దర్గా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మైనారిటీ ప్రతినిధులకు ప్రవేశాల కరపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ.. మైనారిటీ గురుకుల పాఠశాలలో అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా 5వ తరగతిలో మైనారిటీ, నాన్ మైనారిటీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అలాగే 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు కేవలం మైనారిటీలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌మీడియేట్ ప్రథమ సంవత్సరం సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో మైనారిటీ, నాన్ మైనారిటీలు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీలత పేర్కొన్నారు.

నేడు 'కుడా'లో మంత్రి సురేఖ సమీక్ష

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 2: హనుమకొండలోని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శనివారం సమీక్ష జరుగనుంది. మంత్రి కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు సమీక్ష ఆరంభంకానుంది. జీడబ్ల్యూఎంసీ, కుడాతో పాటు లైన్ డిపార్ట్‌మెంట్ల అభివృద్ధిపనులపై మంత్రి సురేఖ సమీక్షించనున్నట్లు తెలిసింది. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా కొండా సురేఖ 'కుడా' కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్నారు.

వీఆర్ఏ నియమాకాలు చేపట్టాలి

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 2: 61 ఏళ్లు నిండిన వీఆర్ఏల వారసులకు నియమాకాలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలకు రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేసి ఆరు నెలలు కావస్తున్నా నియామక ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. దీంతో మానసికంగా, శారీరకంగా, మా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. వెంటనే జీవో ప్రకారం మా వారసులకు ఉద్యోగ నియమాకపు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

దామెరలో కొండచిలువ కలకలం



దామెర, ఫిబ్రవరి 2 : దామెర మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఓ కొండ చిలువ కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దామెర మండల కేంద్రంలోని అంబేద్కర్ జంక్షన్, విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో పంట పొలాల నుంచి ఓ కొండ చిలువ రోడ్డు మీదకు చేరింది. పంట పొలాల నుంచి పక్కనే ఉన్న రోడ్డు మీదకు వచ్చిన ఆ కొండ చిలువను చూసి రోడ్డున పోయే వారిని భయభ్రాంతులకు గురయ్యారు. ఈ క్రమంలో కొందరు అక్కడికి చేరుకుని గుమిగూడే లోపే తిరిగి పంట పొలాల్లోకి వెళ్లిపోయింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. సంబంధిత అటవీ అధికారులు స్పందించి, కొండ చిలువను పట్టుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'ఎంపీగా బరిలో నిలిచే అవకాశం కల్పించండి'

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 2: త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి వరంగల్ ఎంపీగా నిలిచే అవకాశం తనకు కల్పించాలని మాజీ కార్పొరేటర్, ఉద్యమ నేత జోరిక రమేశ్ హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్‌కు వినతి పత్రం ఇచ్చారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పలువురు ఉద్యమకారులతో జోరిక రమేశ్ దాస్యం వినయభాస్కర్‌ను కలిశారు. వరంగల్ ఎంపీ నియోజకవర్గ పరిధిలోని శాసనసభ నియోజకవర్గాల్లో ఉద్యమకారుడిగా విస్తృత పరిచయాలున్నాయన్నారు. తనకు అవకాశం కల్పించాలని కోరారు. అధిష్టానం దృష్టికి తీసుకెళతానని వినయభాస్కర్ తెలిపారు.

'గ్రామానికి సేవ చేయడం అదృష్టం'



సన్మాన సభలో ఎంపీపీ, మాజీ సర్పంచ్ తదితరులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 2 : సొంత గ్రామానికి సేవ చేయడం అదృష్టమని ఎంపీపీ మార్క సుమలత రజనీకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కటాక్షాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ మచ్చిక యాదగిరిగౌడ్ తోపాటు పాలకవర్గానికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యాదగిరి గౌడ్ మాట్లాడుతూ.. గ్రామం అభివృద్ధిలో దూసుకు పోతుందని, తన హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని అన్నారు. సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఉప సర్పంచ్ ఒన్నాల సాంబయ్య, కార్యదర్శి సృజన, వార్డు సభ్యులు అరుణ, ఐరబోయిన లక్ష్మి, కవిత, భిక్షపతి, భాగ్యం, రమేష్, సూర్యకుమారి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో సైన్స్ టాలెంట్ టెస్టు

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 2 : మండలంలోని అన్ని పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ పరీక్షలో మండలంలోని 8 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన మొదటి ఐదుగురు విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, జన్నీకుమారి, అశోక్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 2: హనుమకొండ జిల్లాలోని అన్ని కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, వికలాంగ, మైనారిటీ ఫ్రెష్, రెన్యూవల్ విద్యార్థులు 2023-24 విద్యాసంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీలోపు www.telanganaepass.cgg.gov.on వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

ఐనవోలు, ఫిబ్రవరి 2: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆర్టీఏ అధికారులు పున్నేలు ఏకశిల పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ప్రభుత్వం అందించిన మార్గదర్శకాలను అనుసరించి భద్రతను పాటించాలని సూచించారు. 18 యేళ్లు నిండని వారు వాహనాలు నడపరాదని సూచించారు. విద్యార్థిదశ నుంచే రోడ్డు భద్రత, డ్రైవింగ్ నియమనిబంధనలపై అవగాహన ఉండాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనం నడిపేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఆర్టీఏ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌రాథోడ్, కోలా రవీందర్, షాలిని, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

వరికి వైరస్...

తెగుళ్లు సోకి ఎండిపోతున్న పొలాలు
మళ్లీ దున్ని నాట్లు వేస్తున్న రైతులు
చలి తీవ్రతతోనే అంటున్న అధికారులు



తెగుళ్లు సోకి ఎండిపోయిన వరి పొలాన్ని దున్నుతున్న రైతు

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 2 : యాసంగి వరి పొలాలు వైరస్ బారిన పడుతున్నాయి. వరికి అగ్గి తెగుళ్లు, మొగి పురుగు తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో నాటు వేసిన వారం రోజుల్లో పచ్చగా ఉన్న వరి పొలాలు ఆ తర్వాత అగ్గి తెగుళ్లు, మొగి పురుగు లాంటి వైరస్‌లు సోకడంతో ఎండిపోతున్నాయి. రైతులు వివిధ రకాలైన క్రిమిసంహారక మందులు, విష గుళికలు వాడినా ప్రయోజనం లేకుండా పోతుంది. పైగా ఆర్థిక భారం రైతన్నను నిలువునా ముంచుతున్నాయి. వర్షాకాలం కంటే వరి పొలాలు ఎక్కువ దిగుబడి వచ్చి రైతులు ఆర్థికంగా లాభపడుతుంటారు. వర్షాకాలంలో వరికి తెగుళ్లు, తరుచు వర్షం పడుతుండడంతో పొలాలు నీట మునిగి పోతాయి. ఈ సారి యాసంగి పంటలకు నీరు తక్కువగా ఉండడంతో రైతులు డిసెంబరు నెలలోనే వరినాట్లు వేశారు. నవంబరు చివరి వరకు వరినాట్లు కోసి ఆ వెంటనే వరినారు పోసుకొని యాసంగి పంటలకు సిద్ధమయ్యారు. వర్షాకాలంలో ఈసారి వర్షాలు తక్కువగా కురియడంతో మెట్ట ప్రాంతమైన భీమదేవరపల్లి మండలంలో బావుల్లో నీరు క్రమ క్రమంగా అడుగంటి పోతోంది. దీంతో రైతులు డిసెంబరు నెలలోనే వరినాట్లు వేశారు. వర్షాకాలంలో ఎక్కువగా వరినార్లు దిగుబడి రాకున్న యాసంగిలో ఎక్కువ దిగుబడి వస్తుందని త్వర త్వరగా నాట్లు వేశారు.

ఎకరానికి రూ. 14 వేల ఖర్చు

ఒక ఎకరంలో రైతు వరినాటు వేయాలంటే రూ. 14 వేల ఖర్చు అవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఎకరం వరి పొలం దున్నుడుకు రూ. 6 వేలు, నాటు వేసేందుకు రూ. 5 వేలు, నారుకు రూ. 1500, ఎరువులకు రూ. 3 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. కానీ యాసంగి వరి పొలాలు వివిధ రకాలైన తెగుళ్ల బారిన పడడంతో మండలంలోని పలువురు రైతులు వరి పొలాలను దున్ని మళ్లీ నాట్లు వేస్తున్నారు. దీంతో రైతులకు వ్యవసాయ ఖర్చులు తడిసి మోపెడు అవుతన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి పొలాలను వైరస్ బారి నుంచి కాపాడుకునేందుకు ఇప్పటికే రైతులు విష గుళికలు, క్రిమి సంహారక మందులను స్ప్రే చేస్తున్నారు.

వైరస్ సోకడంతో మళ్లీ నాటు వేశా..



రాపల్లి రవీందర్, రైతు, ముల్కనూర్

నేను యాసంగిలో నాలుగు ఎకరాల వరి పొలం డిసెంబరు నెలలో వేశాను. పది రోజుల వరకు మంచిగా ఉన్న వరి ఆ తర్వాత క్రమేపి ఎర్రబడడం, వరి పీలికలు క్రమేపి ఎండిపోయాయి. వివిధ రకాలైన క్రిమిసంహారక మందులు పిచికారీ చేసిన లాభం లేకుండా పోయింది. దీంతో వేసిన నాట్లు మళ్లీ దున్ని మళ్లీ నాటు వేశాను. దీంతో ఖర్చు ఎక్కువైంది.

చలి తీవ్రత ఎక్కువగా ఉంది



దామోదర్‌రెడ్డి, ఏడీ, హనుమకొండ

ఈసారి రైతులు యాసంగి పంటలు డిసెంబరు నెలలోనే వేశారు. చలి తీవ్రత ఉండడంతో యాసంగి వరి పొలాలకు అగ్గి తెగుళ్లు, మొగి పురుగు లాంటి వైరస్‌లు వరికి సోకాయి. వివిధ రకాలైన క్రిమిసంహారక మందులు, విష గుళికలు స్థానిక వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు వాడాలి. కొన్ని ప్రాంతాల్లో జింక్ లోపం ఉంది. దీంతో వరి పొలాలు ఎర్రబడుతున్నాయి. డిసెంబరు నెలలో కాకుండా జనవరి నెలలో చలి తీవ్రత ఉండడంతో వరికి వైరస్ సోకుతుంది.